# నాన్యః పంథా

రామకృష్ణశాస్త్రి

‘ నేను వాడి పీక నులిమేశాను -

‘ నేనే చంపింది. నమ్ముతావా, లేదా-

—నమ్ముదామా...అప్పటికే మూడో కాలంలో ఉన్నాడు. ఎన్ని సీసాలో ఖాళీ అయినవి, కాని ఆకళేబరం ఇక అంతైనా భరాయించుకునేటట్టు ఉంది. మాటఎక్కడో సముద్రం అట్టడుగునుంచి వస్తూన్నట్టుంది. దానికి విలువ ఏమిటి ?

—నమ్మకపోదామా... అతడికి తాగుడు తల కెక్కినకొద్దీ, నిదానం హెచ్చుతుంది. ...మెదడు పూర్ణంగా వికసించి సబబుగా పని చేయ మొదలుపెడుతుంది...కాని, ఏమో...

అప్పటికి అరడజనుసార్లన్నా, నామీద ఈవాక్యం ప్రయోగించాడు. నాకు ఎటు అనడానికీ పాలుపోవడం లేదు. చూపులు అప్పగించి కూర్చుని ... ఎదట, ఎప్పుడో చల్లారి తెరకగట్టుకుపోయిన టీవంకనైనా చూడకుండా, అతడు రెట్టించినపుడల్లా కొత్త ఖంగారు పుట్టి ఉలికిపడుతూ ‘ ఇలా వచ్చిందేమా భగవంతుడా ’ అని మనసులో అనుకుంటూ ఉన్నాను.

నిండుకుండ జారి క్రిందపడినట్టుగా ... పట్టించిన మధురసం ఇముడక, ఉన్నచోటనే భళ్లుమన్నాడు... తెళ్లుకు, తెళ్లుకు...

నేనూ మరో వెయిటరూ, సాయంపట్టి, పైన గదిలోకి చేర్చాము. ఒళ్లు తెలిసినతరువాత, ఓపట్టానికి సత్తువ చేసుకుని, లేచి, దిండ్లమీద ఒరిగి కూర్చుని కాఫీ తాగి... సిగరెట్లు, దమ్ము కొకటిగా, అయిదు నిమిషాలు ఊదేసి...అప్పటికి బాగా తేరుకుని... సోఫామీద నాపక్కను సర్దుకున్నాడు. ఇక గ్రంథంలోకి దిగుతున్నాం......అని నాకు వెంటనే అనిపించింది.

‘ నీవు నమ్మవు కాదూ ? ’ ఒక్కొక్క మాట ఒక్కొక్కస్థాయిలో ... గుణించుకుపోయే ఊతంతో, నన్ను జవాబుకు మొగమాటపెడుతూ నొక్కులుగా ఉచ్చరించాడు. నేను అప్పటికీ ఏమీ అనలేకపోయినాను. ఆతనికి మతి పూర్తిగా పోయిందేమో నని దిగులూ, భయం పూర్తిగా కమ్మేసి ఊపిరి సలుపనీయడంలేదు.

‘ అవునులే...నమ్మవు. నాకు తెలుసునులే, నీవేకాదు, మనవా డెవడైనా ఇంతే... స్నేహితులం కాదుటోయ్, ఒకరిమీద ఒకరం ఈగ వ్రాలనిస్తామా? స్నేహమైనాక...ప్రాణమైనా...ఊ...ఈస్నేహమే వాడి ప్రాణం తీయించింది.

‘నే నిలా ఎందుకు అయినానో గ్రహించావా వాడిమూలానే : ఇదివరకన్నావా... సరదాకు తాగాను : ఇవాళ...సరదా ఇహనుంచీ చచ్చిపోవాలని...నాగొప్ప హృదయం ...ఇతరుల కష్టాలు సహించలేని దొడ్డతనం

...వీటిమీద ఈ బ్రాందీ నోటితో ఖాండ్రించి ...ఉమ్మేయాలని. ఏదీ సిగరెట్ ?'

ఒకటి చేతికి యిచ్చి కేసు ఆతనికి అందుబాటులో ఉంచి, నేను కొంచెం ఎడంగా జరిగాను. ఒకసందర్భం చెప్పడం, ఒకగుక్క పొగలాగడం, ఇలా ఆసాంతమూ నడిచింది... చూపుల్లో కాని...ధోరణిలో కాని ఉద్వేగం... నరాల దడదడ తప్ప...నిబ్బరము మాలిన తూలుడు అగుపించడం లేదు. అందువల్ల, చెప్పేది వినడానికి...నమ్మినా నమ్మకపోయినా ...ఇకమీద నా కేమీ బెదరు కలగలేదు.

'వా డింత ఛండాలు డౌతాడని'... గుండెలు క్రుళ్లించుకుంటాడని నేను ఎన్నడూ అనుకోలేదోయ్......పన్నీరు బూడిదరాసిమీద ఎన్నికడవలు కుమ్మరించినా... ఎందుకులే, ఎవరి ననవలసినపనేముంది ?... సరేలే...అసలు అరవీశె, ఉపోద్ఘాతం ఆరువీశెలూ అవుతూందే...ఓహో—

'నేను దాసును చూసేటప్పటికి; వాడి మనసు మండి మారణహోమ మైపోయి ఉన్నాడు : లోకంకోసం...మధ్యమధ్య తనకోసం...పద్యాలలో ఏడ్చి ఏడ్చి...తరుక్కుపోయిన మనసుముక్క లన్నీ దేశంమీద విసిరివేసి .....కొవ్వొత్తి ఆరిపోయేముందు గులేబులాగా ఉన్నా డంటే...చదివి తలలూపి భేష్ భేష్ అన్న ఒక రండాకొడుకన్నా...బతిమాలి, తెప్పించుకుని ఉల్భాగా అచ్చువేసుకున్న ఒక్క ఎడిటర్ అన్నా ...ఆలాటి రత్నాలు వెదజల్లుతూన్న వాడు ఏమైనాడో, తినడానికి తిండి ఉందో లేదో... అని ఎన్నడన్నా కనుక్కున్న పాపాన పోయినాడా ?

'చూసేటప్పటి కల్లా నాకు కళ్లవెంట నెత్తురుచుక్కలు రాలినాయోయ్. దేవతలు వరాలిచ్చే ఉద్యోగాల లోంచి రిటైరై...ఉపకార వేతనాలు పుచ్చుకుంటూన్నారు కాదూ... ఈపచ్చికలిలో దేవుడల్లే నేను వానిపాలిటికి కనబడదా మనుకున్నాను. ఆ అహంకారమే ఇంత ముంచింది.

'పక్కాకవికి ఉండే పొగరుమోతుతన మంతా ఝళిపించి...నన్నూ, నే చేయబోయే సహాయాన్నీ గడ్డిపోచ క్రింద దులిపేశాడే మొదట ! ఆ మూర్ఖపుపట్టు, వాడు విడవకుండా...లొంగిపోకుండా ఉన్నా...బాగుండేదే...నాకోసం కాదు...లోకంకోసం నా యేడుపు.

'కలలోనైనా ఉట్టిమీదకు ఎక్కించకూడని పుణ్య - నిర్భాగ్యమూర్తిని...కళ్లుతెరుచుకుని ఒక్కమాటుగా ఆకాశంలోకి ఎగురవేశాను. పడింది... నేను చేతులార చేసిన పాపంతోడి అదీ...బద్దలైంది.

'ఏం కావాలో...ఆతడు కోరుకోకుండానే అన్నీ యిచ్చానోయ్. దారిద్ర్యమనేది వాడికి ఆమడ దూరంలోనైనా కాలుపెట్ట వీలులేకుండా చేశానోయ్. ఇంతవరదాకా చిల్లర రత్నాలు దొరికినగనిలో ఇక ప్రతి వేటుకూ తగిలేది కోహినూరే ననుకున్నానోయ్...

'నందదేవీ శిఖరానికి ఎక్కడానికి జర్మను పండితులు ప్రయత్నం చేద్దా మని వచ్చారని పత్రికలో చదివి... నేనూ వాళ్లలో కలుద్దామని వెళ్లిపోయినాను...అన్నికష్టాలూ పడి...ఏమీ సాధించలేక, ఆరునెల్లకు వాళ్లు...హతమారగా మిగిలినవాళ్లు...ఓడ ఎక్కారు. నేనూ యింటిముఖం పట్టాను.

‘వచ్చిన మర్నాడు, దాసును వెదుక్కుంటూ... వాడుంటూన్న యిల్లు కనుక్కొని పోయినాను. నాపిలుపు అంది, నౌకరు వచ్చి, లోపలకు తీసుకువెళ్లి... ‘అయ్యగారికి చెప్పి వస్తా’నని వెళ్లాడు. దగ్గరగా ఉన్నవాలు కుర్చీలో కూలబడి... గది అమరిక చూసి, మురుస్తూ ‘మనవాడు ఇంకా ఫాయాలోనే ఉన్నాడు కదా... డబ్బుకు కొదవలేదాయెను ...వ్రాసినపద్యాలు...సంపుటాలుగా...ఎంత అందంగా అచ్చువేయించాడో...నాకు అవన్నీ యిస్తాడు కాబోలును, ఎన్నాళ్లకు కనబడ్డావని నన్ను అమాంతం కౌగలించుకుంటాడు కాబోలును, కొన్నాళ్లదాకా అక్కడే తన వద్దనే ఉండమని బలవంతంచేసి, నిలిపివేసుకుంటాడు కాబోలును...ఆలాగైతే ఎంత కులాసాగా కాలక్షేపం అవుతుంది: ఒకవేళ... ఎవరన్నా ప్రేయసి ఏర్పడిందేమో...అంతవాడు కోరాలిగాని...అసలు అందాకా అక్కర్లేదు, ఆతనిపేరువిని...రచనలు చూసి...నేనంటే నేనని...ఎందరెందరు రావణుని కోటగుమ్మంలో దివ్యసుందరులులాగ పడికాపులుగా ఉండరు?... నేనుండటం ఆపక్షంలో...ఆతనికి అభ్యంతరంగా ఉంటుందేమో...అయినా...

‘— ఇన్నికలలతో దాసు లోపలికి వస్తాడా అని ఎదురుకాచుకుని...గుమ్మానికి ఉన్న కర్టెన్‌రింగులు చిరుగాలికి రవంత గలగలమనినప్పుడల్లా...ఆతడే వచ్చాడని భావనలోనుంచి మేల్కొంటూ—’

—తలుపు టకటక మంది: ‘కమిన్’ అనిపించుకుని వెయిటర్ వచ్చి కాఫీకప్పులు, గోడదగ్గిరగానున్న టీ పామ్ మాయెదటికి లాగి, మీద ఉంచాడు. త్రాగుతూండగా, టిన్ను అంచుతో మీట వెనుకకు నెట్టి గోరువాటంనొక్కి–గిర్రుమనిపించి డిప్ప ఊడదీసి...కాగితం చెవి పట్టుకుపైకెత్తి...డబ్బాబల్లమీద పెట్టాడు. చెరోసిగరెట్ తీసుకున్నాము ‘ఏయ్ అవి తీసేయ్...’ వెయిటరు వాజులోంచి వాడిన పూలను తీసి కప్పులు పట్టుకు వెళ్లిపోయినాడు...ఆతడు అగ్గిపుల్ల మంటమీదుగా నా మొగంవంక చూసి ‘నాకు, పనికిరాని వంటే పరమరోత’...అని పొగ భుగభుగ మనిపించాడు.

–‘వచ్చాడు; దాసు, అరగంటకి... దర్శనం ప్రసాదించాడు. మనం అంతవరదాకా గాలిలో కట్టిన స్కై స్క్రేపర్సు అన్నీ ఒక్కమారు పునాదులంటా కదిలి...

‘ఎలా ఉన్నా డనుకున్నావ్...పుల్లాహవుతాం...ఫుడ్డాహవుతామ్’ అదీ కథ... అదీ దీక్ష. చంద్రనిప్పలు కళ్లుమాత్రం.. కర్రకొనకు కట్టిన మందారమొగ్గలులాగా...

‘ఒంటరిగా దయచేశాడా? పుదుచ్చేరి సీతారామవిగ్రహా లుంటాయి చూశావా... వీడి భుజంమీద తల వాల్చుకుని...పద్మినీజాతిదానికన్నా సిరసించిపోయిన వాడి నడుముచుట్టూ...ఒకచెయ్యి మలుపుకుని... చీకటిపడగానే క్రీపడల్లో ఏసందులో చూసినా మనకు తగులుతూంటారే చిల్లర శ్రీమహాలక్ష్ములు...అదొకతె...

‘చూశాడు... వేయబోయే అడుగు ఎత్తి ఆలాగే ఉంచి భగీరథుడులా...చూశాడు...చూశాడు.

‘ఆపిశాచం, కోరమొగంవేసి కళ్లు చికిలించింది... ఇద్దరూ అక్కడనుంచి ఒకటే ఇకిలింపు... మాటలు పెగలని విరగబడటం-

‘దాసూ’

'ఏం...దుకోయ్ వాసూ!'

'అందాకా ఎక్కింసీ'

'సం-ద-దేవిదాకా...మళ్లా... ది.గి.ంది ...ఇహిహీయ్'

'—ఇదీ...మా సంభాషణ...పిశాచాలు తరుముకు వస్తూన్నట్టుగా... ప్రాణం గుప్పిటలోకి తెచ్చుకుని బయటకు ఒక్క ఉరుకు ఉరికాను.

'ఆ ఇహిహీలు' నాకు స్పృహతప్పేదాకా చెవులల్లో గింగురుమంటూ నేఉన్నవి: పక్కమీదనుంచి లేచి కాలు క్రిందపెట్టేటప్పటికి పదిహేనురోజు లైంది. కాని, అంతటితోనైనా ఈదేహికి బుద్ధి వచ్చిందా ?

'సీరసం వదలకుండా నే...మళ్లా వాడికోసం...పడుతూ లేస్తూనే పోయినాను... కాని...వాడు ఆయిల్లు వదిలేశాడు. ఏమైనాడో ఇరుగూ పొరుగూ ఎవరిని విచారించినా తెలియదన్నవారే. వెదికాను...పట్టణం అంతా గాలించగా, చివరకు ఓమారుమూల, ఎక్కడో అధ్వాన్నపు అడివిలో, ఓ పెణక కూలిపోయిన వసారాలో, చొక్కా అయినా లేకుండా చింకిచాపమీద రెల్లు పుడకలాగా కొట్టుకుంటూ పడి ఉన్నాడు.

—'చూసి నేను వెనక్కు తగ్గాను. దాసు లేచివచ్చి నామీద తూలి కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టాడు. నాకు తలతిరిగిపోయింది... అనునయంగా... చేతితో వీపు నిమిరాను...ఏం మిగిలాడు... ఎముకలైనా గుప్పెడయేటట్టులేవు! అయినా ఇప్పటికైనా ఫరవా లేదు. చేసిన దంతా తప్పని తెలుసుకుంటే, ఇదే పశ్చాత్తాపమైతే...నీరు అంటి పచ్చి నిలవాలికాని... ఎంత మ్రోడైతేమాత్రం... ఎంతలో చిగిర్చి పువ్వులు ఘుమాయిస్తుంది...దోహదం మన చేతులో...

—'అప్పటికీ మనబుద్ధి గడ్డి తింటూనే ఉందోయ్. అంతా అబద్ధం: నేననుకున్నదంతా శుద్ధతప్పు. ఆ పగలమారి ఏడ్పు లెందు కనుకున్నావ్ ? రంభకు సాక్షాత్తూ పినతల్లికూతురు, ఆ...ఉందే, ఆలోకైక మోహిని...వీడిమాటాముల్లెతోగూడా మరొకడితో రైలెక్కి ఉడాయించేసింది. అందుకోసం...ఈ కన్నీళ్లన్నీ...దాన్ని చూడందీ ...దానితో కలసి ఉండందీ బ్రతకలేడు... కవిత్వం లేదు...లేదు, కవి నని అసలు వాడికి జ్ఞాపకమే లేదు.

—'నవనాడులూ క్రుంగిపోయి...లేచాను. నాకాళ్లు పట్టుకుని వదలడే... ...దాన్ని ఏలాగైనా వెదకి నేను తీసుకువచ్చి...ఇక ఆపైమాటలు వినిపించుకోకుండా... డబ్బు ఏమన్నా యివ్వమన్నదానికిమాత్రం, రేపు వస్తానని ఓకేక వెనుకకు విసిరివేసి అటు తిరిగిచూడకుండా వచ్చేశాను.

'రెండు దినాలదాకా, ఆ చాయలకు పోలేదు. పోదలచుకోలేదు. మనసు సలా సలా మరిగిపోతూంది. పరిపరివిధాల ఆలోచనలు పోయినవి. ఆ పీడకలలోంచి దూసుకుపోయి... మళ్లా హిమాలయాల్లో పడదామనుకున్నాను. కాని...

— 'వెళ్లాను. అప్పటికే ఉసురు లోడిపోయి చీమలుపట్టి ఉండవలసిన దేహం... ఇంకా ప్రాణజ్యోతిని కొండ ఎక్కనీకుండా ఎలా అంటిపట్టుకుని ఉన్నదో'... దాసును లేచి రమ్మన్నాను. 'ఎక్కడికి'...అని త్రాణ

లేనందువల్ల పనసచదివినట్లు ఎగుడుదిగుడు స్వరంతో... మాట ఊదాడు. 'స్వర్గానికి' అన్నాను'... విషంగా.

లేని ఆసలు... లేనిసత్తువ, తెప్పించుకుని నా వెంట బయలుదేరాడు: పవల్లా మహారాజులలాగా గడిపాం. అంటే వాడు, కడుపుకు వెక్కసమయేదాకా తిని... పొర్లి వచ్చేటట్టుగా త్రాగుతూంటే... నేను... ఇంకా ఇంకా అని పురికొల్పుతూ...

'చీకటి పడినతరువాత మాంచి బందోబస్తయిన నీమాటిని... అనుకున్నదాని కిబ్బడి ధర యిచ్చి... ఆగదిలోకి... సింహాన్నిలాగా వదిలాను... ఎక్కిళ్లూ ... నవ్వులూ ... బుసలూ... అన్నీ ఆ ప్రళయ-శోభనపు గదిలోంచి... తెల్లవార్లూవింటూ... గుమ్మం దగ్గిర ...కంటిలో వత్తులు వేసుకుని, కునుకకుండా కాపలా కూర్చున్నాను.

'చీకట్లు విచ్చుతూండగా... తలుపులు నెట్టుకుని లోపలికి వెళ్లాను... చెల్లాచెదరుగా ...ఇద్దరూ ఒకరిసరసను ఒకరు యుద్ధభూమిలాగా ఉన్న పక్కమీద పడి ఉన్నారు... వాడికి శ్వాస ఇంకా ఆడుతూనేఉంది...

'ఎండుపుల్లను ఫెళుక్కు మనిపించినట్టుగా... వాడిగొంతు నులిమేశాను. ఆరవంత గొరగొర... దాని గుర్రుహోరులో కలిసిపోయింది... ఈ నిశ్శబ్దపు... అలజడికే అది మేలుకుని... చూసి గ్రహించి... ఒకపొల్లు కేక వేసుకుంటూ... లేచి... దౌడాయించింది.

'ప్రొద్దునుంచీ... ఆగది వదలినప్పటి నుంచీ... దోవా తెన్నూ అనకుండా... తిరుగుతూండగా... నీవు కనుపించావు... రెండేండ్ల నుంచీ సీమలో ఉన్న నీవు... సరిగా యీ సమయానికే ఊడిపడటం... ఒకందుకు మంచిదేలే...

'నేను... ఇక ఎవరి ఎదుటా నోరుమెదప దలచుకోలేదు. లోకం ఏమనుకుంటే నాకేం...

'నేను చేసింది నామనసుకు నచ్చిందా లేదా... అయ్యవారిని చేయబోగా... కోతి... కొండముచ్చుగా మారింది... వాడిదేహాన్ని సుఖపెడదామని... మితిమాలిన ఎరువు వేసి... మనసును కుళ్లించాను... అక్కరకువచ్చి... తెలుగుజండా... దేశదేశాల త్రిప్పవలసిన... మహాకవి.... నా దరిద్రపుధర్మగుణంమూలాన... ఇంత పనికిమాలినవాడైపోయినాడు ...అసలే ఎడారిగా ఉన్న మన కావ్యక్షేత్రంలో ... మరోమోడుకూడా ఎందుకూ... పూలమొక్కకు పురుగు అంటించినవాడే... కుళ్లగించివేయడం... ధర్మం.

'సబబవునా కాదా... ప్రకృతి... సజావుగా ఉండక... మస్కాకొట్టినప్పుడు... ఎదురుతిరిగి దానికన్న ముందు మనం... దాని విశ్వనేత్రాల్లో దుమ్ముకొట్టి... సంహారకార్యం అంటూ వచ్చేటప్పటికి... నీకు తీసిపోయేవాడిని కానేవ్... అనిచూపించడం... మాత్రమవునా కాదా?

'నీవు... ఏమంటావ్?'

— ఆమాట చెవిని పడి... నా ఆలోచనలు సుడి తిరగడం... వడి తగ్గకముందే ... పోలీసులు వచ్చారు.